


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

"...ఏ **రంగంలోనైనా** ఏ కళలోనైనా కళని శాసించగల కళాకారులు కొద్దిమందే ఉంటారు కార్తీక్. కాలంతోపాటు నిలబడిపోయేవాళ్ళు వారిలో మరీ కొందిమంది!! వాళ్ళ ఊపిరి తపన. వాళ్ళ ఆలోచనలు ఘర్షణ. వాళ్ళ జీవితం వేదన. వాళ్ళు చరిత్రని శాసిస్తారు!! మైలురాళ్ళూ, మార్గదర్శకులూ అవుతారు. మన రంగంలో అలాంటి చిత్రకారులు లీనార్డో – డా – విన్సీ... మైకెలాంగిలో... పికాసో..." అని ఆమె అలసటతో కళ్ళు మూసుకుంది. కార్తికేయ ఆలోచన్లు క్రీస్తు పూర్వం ముప్పైవేల సంవత్సరాలు వెనక్కి వెళ్ళాయి.

ఏ నీటివాగు పక్కనో ఒక ఆదిమానవుడికి – తన ఆలోచన్లని, 'చెక్కటం' ద్వారా కాకుండా, 'రంగులు అద్దటం' ద్వారా బయట ప్రపంచానికి కమ్యూనికేట్ చేయవచ్చుననే ఆలోచన రావడం – ఏ కొండ గుహలోనో, మొట్టమొదటి చిత్రానికి అంకురార్పణ అక్కణ్ణుంచి ప్రారంభమైంది.

చిత్రకళలో ముగ్గురు మైలురాళ్ళు. ప్రపంచపు అత్యున్నత స్థానాన్ని ఆక్రమించిన 'మోనలిసా' చిత్రాన్ని భూలోకవాసులకు బహుమతిగా ఇచ్చిన లీనార్డో – డా – విన్సీ మొదటివాడు. చిత్రాన్ని వేయటానికి ఆయిల్ పెయింట్ వాడొచ్చునన్న విషయం కనుక్కున్నది లీనార్డోయే!

రెండు మైకెలాంగిలో... వంద అడుగుల ఎత్తున చర్చి అంతర్భాగపు పై 'కప్పు' మొత్తాన్ని బొమ్మల్తో చిత్రీకరించటం కోసం – నాలుగు సుదీర్ఘమైన సంవత్సరాలు ఒక్కడే... 'మంచె' మీద వెల్లకిలా పడుకుని అవిరామంగా పనిచేసి వెన్నెముక పోగొట్టుకున్న చిత్రకారుడు.

మూడు పికాసో. ఒక చిత్రాన్ని చూడాల్సింది కళ్ళతోకాదు. మెదడుతో – అన్న సర్రియలిస్టిక్ సిద్ధాంతాన్ని చిత్రకళలో ప్రవేశపెట్టినవాడు పికాసో... అందం కళ్ళు చెపితే, అర్థం మెదడు చెపుతుందని, ఒక్కొక్క కోణంలో ఒక్కొక్క అర్థాన్ని చూపించిన ఆధునిక పితామహుడు పికాసో – అందాన్ని తగ్గించాడు. క్లిష్టతని పెంచాడు.

...న్యాచురలిజంతో మొదలై, ఎక్స్‌ప్రెషనిజం వైపు పయనించి, ఆబ్‌స్ట్రాక్ట్ సర్రియలిజంలోకి అడుగుపెట్టిన శతాబ్దాల చిత్రకళా గమనంలో అనూజ్ఞ చెప్పినట్టు ఈ ముగ్గురూ లబ్ద ప్రతిష్టులు. కాని వారి ప్రసక్తి ఇప్పుడెందుకు?

అతడి మనసుని అర్థం చేసుకున్నట్టు అతని చేతులమధ్య ఆమె చెయ్యి కదిలింది. ఆమె కళ్ళు విప్పి అంది. ''కార్తీక్ మోనలిసా పెయింటింగ్‌ని అధిగమించే చిత్రాన్ని మీరు వెయ్యాలి. అదీ మీరు నాకు చెయ్యవలసిన వాగ్దానం. చరిత్రలో మీరు నాలుగో వ్యక్తి కావాలి.''

బలమైన గాలికెరటంతో పాటు పయనించిన మంచు వడగళ్లు కిటికీ అద్దాలకి ఫెతేలున తగిలి పింజెలుగా విడి రాలిపోయినట్లు అతడి ఆలోచన్లు నాలుగు వైపులకి ఒక్కసారి చెదిరి అయోమయం మిగిలింది. అతడు ఆమెవైపు పిచ్చివాడిలా చూశాడు. అతడెంత విభ్రాంతుడయ్యాడంటే 'ఆమె మరణం అంచున ఉన్నది. ఆమెతో వాదోపవాదాలు అనవసరం' అని కూడా మర్చిపోయి, ''నీకేమైనా మతిపోయిందా అనూజ్ఞా నేనేమిటి? లీనార్డ్ – డా – విన్సీతో పోలికేమిటి?'' అన్నాడు.

''ఇద్దరికీ పోలికలున్నాయి. పరిశీలించి చూసుకోండి. ఏ నవలాకారుడైనా లీనార్డ్ జీవితచరిత్ర వ్రాస్తే 'ఇంజనీరు అనాటమీ వ్రాయటం ఏమిటి? చిత్రకారుడు మ్యూజిక్ వాయించటం ఏమిటి? మరీ ఇంత అభూత ధీరోదాత్తత ఏమిటి? అని విమర్శిస్తారు.''

అంతలో ఇద్దరు డాక్టర్లు అక్కడికి వచ్చారు. ఆమెని పరీక్షించి మొహాలు చూసుకున్నారు. అనూజ్ఞ నవ్వుతూ ''ఏం డాక్టర్? ఏదయినా అద్భుతం జరిగి నేను బ్రతకబోతున్నానా?'' అంది.

డాక్టర్లు మాట్లాడకుండా అక్కడనుంచి వెళ్ళిపోయారు. కార్తికేయ స్టూల్‌మీద నుంచి లేచి వాళ్ళని అనుసరించాడు. ''ఏమిటి డాక్టర్ అసలేమైంది?''

ఈ ప్రశ్నకి కొంచెం ఇబ్బందిపడి డాక్టర్ ఏదో చెప్పబోతోంటే వెనుక మంచం దగ్గర చప్పుడు వినిపించింది. అందరూ వడివడిగా అటు వెళ్ళారు. మంచం మీద ఆమె మెలికలు తిరుగుతోంది. కార్తికేయ చప్పున ఆమెని పట్టుకున్నాడు.

ఆమెలో కదలిక క్రమంగా ఆగిపోసాగింది! ఆమె చెయ్యి నెమ్మదిగా పైకిలేచింది డూ...యూ...లవ్...మి... అన్నట్టుగా... ఆఖరి ముద్ర ఆ చేతిమీద వెయ్యమన్నట్టుగా ఎవరో అన్నట్టు, పెదవులమీద చిరునవ్వు – కళ్ళనిండా నీళ్ళు – అదేగా వీడ్కోలంటే –

అతడా చేతిని అపురూపంగా దగ్గరకి తీసుకున్నాడు. మృత్యువు పాము కాటు రూపంలో ముద్రవేసిందా అన్నట్టున్న ఆ మచ్చమీద పెదవుల్తో సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు.

అప్పటివరకూ ఒంటి కంటితో అతడి చర్యని కొంటెగా చూస్తున్నదల్లా రెండో కన్ను కూడా తెరచి ''థాంక్స్ కార్తికేయగారూ, రెండోసారి ముద్దు కూడా అయిపోయింది'' అంది.

దారం తెగ్గానే పూసలు జారిపోయినట్టు చిన్న జెర్కు! కార్తికేయ అనాలోచితంగా ఆ చేతిని వదిలేశాడు. ఆమె పక్కమీద లేచి కూర్చుంది. ఇద్దరు డాక్టర్లూ తెల్లకోట్లు విప్పేసి చేత్తో పట్టుకున్నారు. అప్పటివరకూ దూరంగా ఉన్న గోవింద్‌గోపాల్ నవ్వుతూ దగ్గరకి వచ్చాడు. ''ఏమిటిదంతా?'' కార్తికేయ అడిగాడు.

''పందెం గెలవటం కోసం నాటకం!'' అంది అనూజ్ఞ. ''చెప్పాగా! మా వాళ్ళతో వేసిన పందెం గురించి.'' అతడింకా షాక్ నుంచి తేరుకోలేదు. అయితే తను ఫూల్ అయ్యానన్న భావంకన్నా, ఆ అమ్మాయి మరణం అసత్యం అన్న భావం ఎక్కువ సంతోషాన్నిస్తోంది.

''వీళ్ళందరూ మా యూనివర్శిటీ స్టూడెంట్లు. మీరు చూసిన డ్రామాలో నటులు. జాగ్రత్తగా గమనించి ఉంటే మీరు వీళ్ళని గుర్తుపట్టి ఉండేవాళ్ళు.'' స్టూడెంట్సిద్దరూ స్నేహపూర్వకంగా నవ్వారు. అనూజ్ఞ అంది– ''నేను కడుపునొప్పి నెపంతో ఇన్–పేషెంట్‌గా జాయినయ్యాను. మంత్రిగారి కూతుర్ని గాబట్టి పెద్ద సమస్యలేమీ రాలేదు. నాతోపాటు ఇద్దరు డాక్టర్లు ఉంటారన్నా ఎవరికీ అనుమానం రాలేదు. ఇక్కడ నర్సులంతా ఎవరి పనిమీద వాళ్ళున్నారు. మిమ్మల్ని మామూలు విజిటర్ అనుకున్నారు. ఆ మాత్రం ఛాన్సు దొరికేసరికి నేనిక విపరీతమైన మెలో డ్రామా నటించాను.''

''ఒక చిన్న పందెం కోసం ఇంత నాటకమా?''

''చిన్న పందెం ఒకటే కాదు. మీతో మొనలిసా కన్నా గొప్ప పెయింటింగ్ వేయిస్తానన్న వాగ్దానం కూడా తీసుకున్నాగా...'' అంది. గోవింద్‌గోపాల్ కల్పించుకుని ''ఇక ఇక్కణ్నుంచి మనం బయల్దేరితే బాగుంటుందేమో'' అన్నాడు. అందరూ బయటకొస్తుంటే నర్సులు తెల్లబోయి చూశారు. ''...కడుపునొప్పి తగ్గిపోయింది. వెళ్ళిపోతున్నాను'' అంది అనూజ్ఞ.

''డాక్టరుగారు డిశ్చార్జ్ చేయకుండా అలా వెళ్ళిపోకూడదు మాడమ్'' అన్నారు.

''మా నాన్నగారు డాక్టరుగారితో మాట్లాడారు'' చెప్పింది అధికార యుక్తంగా.

అందరూ హోటల్‌వైపు నడక సాగించారు. రాత్రి ఒంటిగంటకి సిమ్లాలో అలా నడవటం... చలికి శరీరం కొంకర్లు పోతున్నా అదో గమ్మత్తుగా ఉంది. కార్తికేయ మౌనంగా నడవసాగాడు. అతడికి ఇదేమీ బాగోలేదు. మానసికంగా ఎదిగిన తరువాత చిన్న పిల్లల అల్లరి చూడటానికి బాగుంటుంది కానీ పాల్గొనటానికి బావోదు.

హోటల్ ఇంకో వంద గజాల దూరంలో ఉన్నదనగా అనూజ్ఞ అడిగింది– ''ఏం మౌనానందస్వామీ– అలా ఉన్నారు?''

''ఏమీ లేదు.''

''లేదు. ఏదో ఉంది.''

''నాకిదంతా నచ్చలేదు అనూజ్ఞా. మీరంటే కాలేజీ స్టూడెంట్స్. పెళ్ళికాని వాళ్ళు, నన్ను పట్టుకుని ఇలా పందెం వేయడం బావోలేదు.''

''మీరేం భీష్మాచార్యులవారు కాదు కదా. మీకూ మా వయసే ఉంటుంది.''

''కానీ నాకు పెళ్ళయింది.''

నడుస్తున్నదల్లా ఆగి ''పెళ్ళయిందా?'' అంది.

''అవును. నా భార్య పేరు శ్రీకళ్యాణి.''

''మరి ఆమె సిమ్లా రాలేదేం?''

''రాలేదు. రావాలనుకున్నా రాలేదు...'' అంటూ ఆమె స్థితి గురించి చెప్పాడు. ''ఆమె అలా అక్కడ శరీరమంతా అచేతనమై పడి ఉంటే, ఆమె గురించి చూసుకోవలసిందిపోయి, నేనిలా రావటమే నాకు గిల్టీగా ఉంది అనూజ్ఞా! అందుకే ఈ పందేలూ అవీ నాకు నచ్చటం లేదు. అయిందేదో అయింది. ఇక దీన్ని వదిలేసెయ్యి.''

అనూజ్ఞ కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉండి ''సిమ్లాలో ఏ పువ్వులు ప్రసిద్ధి?'' అని అడిగింది.

అసందర్భమైన ఈ ప్రసక్తికి అతడు విస్మయంగా ''ఎందుకు?'' అని అడిగాడు.

''చెవుల్లో పెట్టుకుందామని–'' నవ్వింది. ''లేకపోతే ఏమిటిది మిత్రాజీ? నేను రాజేష్ గురించి ఓ కథ అల్లి చెప్పానే అనుకోండి. మీరు కూడా ఓ కథ వెంటనే కల్పించి చెప్పాలా? కుడిచెయ్యి తెగి నా భర్త జైల్లో ఉన్నాడని నేనంటే, నరాలు చెడి పక్కమీద నా భార్య ఉందని మీరు చెప్పాలా? ఊహూ లాభంలేదు. ఇంకొంచెం బెటర్ స్టోరీ ఆలోచించండి.''

## 3

కార్తికేయ ఢిల్లీ చేరుకునే టైముకి మధ్యాహ్నం రెండయింది. డైరెక్టుగా విమానాశ్రయానికి వెళ్ళిపోయాడు. కౌంటర్‌లో బోర్డింగ్ పాస్ తీసుకోబోతోంటే మైక్‌లో ''యువర్ అటెన్షన్ ప్లీజ్... హైదరాబాదు వెళ్ళే ప్రయాణికుడు మిస్టర్ కార్తికేయ...'' అని ప్రకటన వినబడింది. ఎంక్వయిరీ కౌంటర్ దగ్గరకు వెళ్ళాడు.

''మీరేనా కార్తికేయ?''

''అవును.''

''ఇప్పటి వరకూ నేను మీ గురించే ప్రయత్నిస్తున్నాను. ఇప్పుడే మినిష్టర్ గారు వెళ్ళిపోయారు.''

''ఎక్కడికి?''

''మీకు తెలీదా? వాళ్ళ అమ్మాయి వాళ్ళు వస్తున్న కారుకి ఆక్సిడెంట్ అయింది.''

''ఎక్కడుంది అనూజ్ఞ!''

''ఆమె మరణించింది. మీకు ఆ విషయం తెలుపమని ఆయన చెప్పారు".

ఇది కూడా నాటకమేమో అనుకున్నాడు. కానీ చెపుతున్నది ఎంక్వయిరీ లో. ఆ క్షణం అతనికి ఏం చెయ్యాలో తోచలేదు. సలహా ఇవ్వగలిగింది శ్రీకళ్యాణి ఒక్కతే అనుకున్నాడు. విమానాశ్రయం నుంచే ఎస్.టి.డి. చేశాడు. శ్రీకళ్యాణి

లైన్‌లోకి వచ్చాక మొత్తం విషయమంతా అయిదు నిముషాలు మాట్లాడాడు. ''నాకేం చెయ్యాలో తోచటం లేదు కళ్యాణీ. చాలా చిన్న అమ్మాయి. ప్రైజ్ సంపాదించి కూడా నిరాకరించింది. నేను పెయింటింగ్ వెయ్యటానికి సాయపడింది.''

''దీనికి ఆలోచన ఏముంది? ఈ రోజు అక్కడే ఉండి, వెళ్ళి చూసి రండి. లేకపోతే బాగోదు.''

అతడు శ్మశానానికి వెళ్ళేసరికి ఐదయింది. అక్కడంతా హడావుడిగా ఉంది. అతనికి తెలిసిన వాళ్ళెవరూ లేరు. ఎవరి పనిలో వారున్నారు. అతనొక్కడే దూరంగా మౌనంగా నిలబడ్డాడు. వార్త తెలిసినప్పటి షాక్ తగ్గిపోగానే మనసంతా విషాదం వ్యాపించింది. పెళ్ళికాని అమ్మాయి కాబట్టి దహనం కాదు. ఆ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అతడి దృష్టి అటుగా వచ్చిన మనిషి మీద పడింది. అతడు గోవింద్ గోపాల్. అదే సమయానికి గోపాల్ కూడా అతడిని చూసి దగ్గర కొచ్చాడు. కార్తిక్‌ని చూడగానే చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు. దూరంగా ఉన్న జనం కాళ్ళ మధ్యనుంచి శవపేటిక కనిపిస్తోంది. జనం ఎక్కువమంది లేరు.

శవపేటిక మూయబోతూ ఉంటే, వివేకానంద మోకాళ్ళ మీద కూలబడి కూతురి మొహం మీదకు వంగి, ''అమ్మా – అనూజ్ఞా. నువ్వు లేకుండా మేమెలా బ్రతగ్గలమమ్మా?'' అంటూ బావురుమన్నాడు.

పేటిక లోపల్నుంచి అనూజ్ఞ ''మరీ ఎక్కువగా నటిస్తున్నావ్. అంత మీద పడనక్కరలేదు. కాస్త దూరంగా వెళ్ళి గుడ్ల నీరు కక్కుకుంటూ ఉండు చాలు'' సన్నటి స్వరంలో కోప్పడింది.

''అంతేనంటావా నా తల్లీ... అయ్యో... అమ్మో'' అన్నాడు సంపత్ అదే శృతిలో.

''గంటనుంచీ పడుకుని బోరుకొడుతున్నది. మిత్రాజీని తొందరగా తీసుకొచ్చే ఏర్పాటు చెయ్యి.''

సంపత్ ఎడమ వైపుకు ఓరగా చూసి, ''గోవింద్ గోపాల్ తీసుకొస్తున్నాడు నీ మిత్రాజీని!'' అని ''అయ్యో మా తల్లే... అమ్మా మా తల్లే... పాడు సిమ్లా ప్రయాణం ఎందుకు పెట్టుకున్నావ్ తల్లీ... ఆడపిల్ల అన్నాక అంత ఫాస్ట్‌గా ఉండకూడదని చెప్పానుగా తల్లీ... ఎందుకొచ్చిన పందేలమ్మా ఇవన్నీ... అందులోనూ ముద్దు పెట్టించుకోవటం పందెం ఏమిటమ్మా...'' అంటూ స్వరం హెచ్చించాడు.

''షటప్'' పెదాలు కదల్చకుండా అంది అనూజ్ఞ శవపేటికలోంచి.

''వినపడదులే అమ్మా. అయినా మేమందరం ఉండగా అతనితో ముద్దు పెట్టించుకోవాలన్న కోర్కె ఎందుకు కలిగిందే నా కూతురా?'' అంటూ రాగయుక్తంగా ఏడ్చాడు.

''ఆపుతావా? లేచొచ్చి కొట్టమంటావా?'' అంది అనూజ్ఞ. ''లేస్తే పందెం ఓడిపోతావ్ తల్లీ...'' అని తలతిప్పి ''ష్... వస్తున్నాడు నీ కార్తికేయ. బి రెడీ'' అంటూ హెచ్చరించాడు.

''నీతో కాస్త ప్రైవేట్‌గా మాట్లాడాలి'' అన్నాడు సత్యం శ్రీకళ్యాణితో. ఆమె చిరునవ్వుతో ''మాట్లాడు'' అంది.

‘‘మినిష్టర్ వివేకానంద కూతురు సిమ్లాలో చనిపోయినందుకు కార్తికేయ ఢిల్లీలో ఆగిపోయాడన్నావ్‌గా కళ్యాణీ’’.

‘‘ఫోన్‌లో కూడా అదే అడిగావ్. ఎందుకిన్నిసార్లు అడుగుతున్నావ్?’’

‘‘కళ్యాణీ’’ మొహం విషాదంగా పెట్టి అన్నాడు సత్యం. ‘‘నువ్వూ నేనూ ఇద్దరం అనాథలమే. ఒకరి బాగోగులు ఒకరు చూసుకోకపోతే ఎవరూ చూడరు.’’

‘‘నా బాగోగులు చూడటానికి మా ఆయన ఉన్నాడు గానీ అసలు సంగతి చెప్పు’’ అంది ఆమె నవ్వి.

‘‘కార్తికేయ ఈ రోజు ఢిల్లీలో ఆగిపోవటానికి కారణం వివేకానంద కూతురి మరణం కాదు.’’ అన్నాడు. కళ్యాణి విస్మయంతో ‘‘అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?’’ అని అడిగింది.

‘‘ఎలా చెప్పగలనంటే, వివేకానంద ఈ ఊళ్ళోనే ఉన్నాడు కాబట్టి. అతనికి ఫోన్‌చేసి కనుక్కున్నాను కాబట్టి.’’

శ్రీకళ్యాణి స్తబ్ధురాలైంది. ఆమెను గమనిస్తున్న సత్యం ఈ అవకాశం మరింతగా ఉపయోగించుకునే ఉద్దేశ్యంతో ‘‘ఆ అమ్మాయి పేరు అనూజ్ఞ’’ అన్నాడు.

‘‘అవును. సిమ్లా నుంచి ఫోన్ చేసినప్పుడు ఆయన చెప్పారు.’’

‘‘ఓహో... ఫోన్ చేసి చెప్పటం వరకూ వచ్చిందన్నమాట. పరిచయం అంత వరకూ పెరిగిందని నేను అనుకోలేదులే’’ అంటూ సత్యం మరో అయిదు నిముషాలు అవీ ఇవీ మాట్లాడి వెళ్ళిపోయాడు.

ఆమె మనసు పరి పరి విధాలుగా ఆలోచించింది. చివరికి ఆలోచనలని పక్కకినెట్టి ఆమె పీటర్‌ని పిలిచింది. సత్యం తనకి చెప్పిన విషయాలన్నీ ఆమె పీటర్‌కి చెప్పి, ‘‘దీని మీద మీ అభిప్రాయం ఏమిటి?’’ అంది.

పీటర్ చాలా సేపు మాట్లాడలేదు. తనలో తనే మధన పడుతున్నట్టు చాలాసేపటి తరువాత ‘‘...నా అభిప్రాయం ఏ విధంగా చెప్పమంటారు? మీ విజిలెన్స్ ఆఫీసర్‌గానా? ఒక యాభై ఏళ్ళ వృద్ధుడిగానా?’’ అని అడిగాడు.

ఆమె చాలా ఆశ్చర్యపోయింది. అతను ఎందుకు తటపటాయించాడో అర్థమైంది. అతడడిగిన ప్రశ్నకి దెబ్బతిన్నది కూడా. అయితే తను దెబ్బతిన్నట్టు బయటకి కనపడనివ్వకుండా ‘‘విజిలెన్సు ఆఫీసర్‌గా చెప్పండి’’ అంది బింకంగా.

‘‘అందులో పరిశోధించవలసింది ఏమీలేదు. కార్తికేయ వచ్చాక అసలు విషయం ఏమిటో తనే చెపుతాడు.’’

‘‘అవును...’’ అంది కళ్యాణి. ‘‘... ఒక యాభై ఏళ్ళ వృద్ధుడిగా అయితే ఏం చెపుతారు?’’ అంది. నిజానికి ఆమె అడగదల్చుకున్నది ఇదే. తను తేలిక అవకూడదని మొదటిది అడిగింది.

అతడు కొద్దిగా భయపడినట్టు కనిపించటంతో ‘‘...నా దగ్గర పని చేస్తున్నారని మీరు సంకోచించ వలసిన అవసరం లేదు. మీ అభిప్రాయం ఏమిటి?’’ అంది.

‘‘ఏ వ్యక్తి అయినా తన భార్య గురించి గానీ, భర్త గురించి కానీ మూడో వ్యక్తి దగ్గర చర్చించటమన్నంత తెలివితక్కువ పని ఇంకొకటి లేదని నా అభిప్రాయం’’ అని, చప్పున చేతులెత్తి ‘‘మీక్కోపం వస్తే సారీ మాడమ్’’ అన్నాడు.

ఆమెకు నిజంగానే కోపం వచ్చింది. అతను అతి చనువు తీసుకున్నాడని అనిపించింది. కానీ అతడు 'సారీ' చెప్పటంతో పూర్తిగా మామూలు మనిషి అయిపోయి, ''చెప్పండి'' అంది.

''భార్యాభర్తల బంధం ఒక కోటలాంటిది. మన వాళ్ళ గురించి మనం మూడో వ్యక్తి దగ్గర కాస్త చెప్పామూ అంటే, ఆ కోటలోకివాళ్ళు ప్రవేశించటానికి మనమే చిన్న రంధ్రాన్ని చేసి, వాళ్ళు మన మనసులోకి ప్రవేశించి సానుభూతి మాటల్తో నవ్వుకోటానికి మనమే వీలు కలిగించామన్నమాట.''

ఆమె ఆశ్చర్యపోయింది. జాగ్రత్తగా గమనించాలేగానీ ఇతరులు చదవటం కోసం ప్రతి మనిషి జీవిత పుస్తకంలోనూ ఒక అనుభవపాఠం ఉంటుందన్న విషయం ఆమెకి అర్థమైంది.

''తన భర్త గురించి చివరికి పుట్టింట్లో తోబుట్టువులకైనా చెప్పబోయే ముందు భార్యలు గుర్తుంచుకోవలసిన విషయం ఇది...''

''మరి భర్తలు గుర్తుంచుకోవలసిందేమీ లేదా?'' రిలాక్స్‌డ్‌గా అడిగింది.

అతడు గాఢంగా నిశ్వసించి అన్నాడు... ''నా పెళ్ళయిన రెండు సంవత్సరాలకి నా భార్య మార్గరెట్ పెట్టెలోంచి నాలుగు ప్రేమలేఖలు బయటపడ్డాయి మాడమ్. చాలా హింసించాను. ఒకసారి కొట్టాను కూడా. ఆమె చెప్పేది వినిపించుకోలేదు. తరువాత తెలిసింది... అవి ఆమె స్నేహితురాలు వ్రాసినవని. క్షమాపణలు చెప్పుకున్నాను. కానీ ఏం లాభం? ముప్పయి సంవత్సరాలు అయింది. ఆమె మనసులో గాయం అలాగే ఉండిపోయింది. కలిసే ఉంటాం కానీ, ఆ దూరం అలాగే...'' పీటర్ మొహంలో విషాదం కనబడింది. ''తొందరపడకూడదు మాడమ్. పెళ్ళయిన కొత్తలో అయితే మరీ జాగ్రత్తగా ఉండాలి. ఒకసారి మనసుమీద ముద్రపడితే చెరగదు.''

కార్తికేయ శవపేటిక దగ్గరగా వచ్చి నిల్చున్నాడు. ఫాదర్ మిగతా తతంగం చేస్తుండగా గోవింద్ గోపాల్, మిగతా అనూజ్ఞ స్నేహితులు వచ్చి, ఆమె చేతిని ముద్దు పెట్టుకుని వెళ్ళుతున్నారు. అనూజ్ఞ తండ్రి వేషంలో ఉన్న సంపత్ విషాదంగా ఈ చర్యని గమనిస్తున్నాడు. తను ముద్దాడే ఛాన్స్ మిస్సయ్యేనని.

చివరికి కార్తికేయ వంతు వచ్చింది. అతడు పేటిక దగ్గర మోకాళ్ళమీద కూర్చుని జేబులోంచి ఓ పొట్లం తీశాడు.

''నాయనా? నువ్వేనా కార్తికేయవి?'' సంపత్ అడిగాడు.

''అవును.''

''మా అమ్మాయి నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించిందట నాయనా. ప్రేమ ఫలించకుండానే అర్ధాంతరంగా వెళ్ళిపోయింది.''

''అవును. నాకూ విచారంగా ఉంది.''

''ఇంత చిన్న వయసులో పోతుందని మేము అనుకోలేదు'' సంపత్ విచారంగా అన్నాడు.

''గొప్ప తెలివితేటల్నీ, అపారమైన కళల్నీ ఇచ్చిన వాళ్ళని దేవుడు వెంటనే తన దగ్గరకి పిలిపించుకుంటాడు. తిలక్ అలాగే పోయాడు'' అన్నాడు కార్తికేయ ఓదారుస్తున్నట్టు.

''కీట్స్ అలాగే పోయాడు'' అన్నాడు సంపత్.

''అలెగ్జాండర్ అలాగే పోయాడు'' అన్నాడు కార్తికేయ.

''అభిమన్యుడు అలాగే పోయాడు'' అన్నాడు సంపత్.

అనూజ్ఞకి వళ్ళు మండిపోతోంది. అప్పటికే చాలా సేపటి నుంచి పేటికలో కదలకుండా ఉండటం వల్ల వచ్చిన ఇబ్బందికి తోడు, వొళ్ళంతా చెమటతో తడిసిపోయింది. ఇద్దరూ చెరో వైపునా కూర్చుని చిన్న వయసులో ఎవరెవరు పోయారో గణాంకాలు చెప్పుకుంటూంటే కోపం కట్టలు తెగుతోంది. అయినా అవసరం తనది కాబట్టి నిశ్చలంగా పడుకొని ఉంది.

''స్నేహితులందరూ చేతిమీద ముద్దు పెట్టుకుంటారు. ప్రేమికుడు మాత్రం పెదాల మీద పెట్టుకోవాలి. అదీ మా ఆచారం'' అన్నాడు సంపత్, వింటూన్న అనూజ్ఞ ఉలిక్కిపడింది. సంపత్ కోతి అని తెలుసుగానీ, ఈ విధమైన ఇబ్బంది పెడతాడని అనుకోలేదు. పేటికలోంచి లేచి, సంపత్ మొహం రక్కేయాలన్న కోర్కెని బలవంతంగా ఆపుకుంది.

''నిజమా'' అన్నాడు కార్తికేయ అమాయకంగా.

''అవును. అప్పుడే ఆమె ఆత్మ ప్రభువు పాదాల దగ్గరకు చేరుకుంటుంది.''

"ఎవరు ఆమె ప్రేమికుడు? రాలేదా?"

"మీరే".

అనూజ్ఞ కంగారుపడింది. ఇంతమంది ముందు కార్తికేయ తన పెదవులపై గట్టిగా ముద్దు పెట్టుకోవటం, ఆ తరువాత కాలేజీలో అందరూ చేరి తనని... ఆ తరువాత ఊహించుకోలేకపోయింది. ఇప్పుడు తను ఇక్కడనుంచి లేస్తే, ఓడిపోయినట్టే. కేవలం తనని ఓడించటానికే ఈ కోతులన్నీ కలిసి ఈ విధంగా ఇబ్బందిలో పడేశాయని గ్రహించింది. నాటకం ఇంతవరకు వచ్చాక అభాసు పాలవటం ఇష్టంలేక అలాగే పడుకుని ఉండి పోయింది. కార్తికేయ మొహం ఎంత దగ్గరలో ఉందో ఒక కంటితో చూడాలన్న కోర్కెని అతి కష్టంమీద అణుచుకుంది. పెదవులు మాత్రం అతడి ముద్దుకి ప్రిపేర్ అవుతూ రవ్వంత తెరుచుకున్నాయి.

అయితే ఆమె ఊహించినట్టు కార్తికేయ ముద్దు పెట్టుకోలేదు. సంపత్ వైపు చూస్తూ ''మాలో కూడా ఒక ఆచారం ఉంది'' అన్నాడు.

''ఏమిటది?''

''పెళ్ళికాకుండా ఎవరైనా చచ్చిపోతే కళ్ళమీద కర్పూరం పెడతాం. అప్పుడు ఆత్మ చల్లగా ఉంటుంది.''

వింటూన్న అనూజ్ఞ ప్రాణాలు పైనే పోయాయి. సంపత్ అన్నాడు. ''ప్రభువు వద్దకు వెళ్ళే ఆత్మ ఎలాగూ చల్లగానే ఉంటుంది. ముద్దు పెట్టుకోండి చాలు.''

''కోర్కె వేడిగా ఉంటుంది కదా. దాన్ని చల్లార్చకపోతే ప్రభువు దగ్గరకు వెళ్ళవలసిన ఆత్మ సైతాను వద్దకు వెళ్తుంది.''

''అయినా ఇప్పుడు హారతి కర్పూరం ఎక్కడ దొరుకుతుంది?'' ఆఖరి అస్త్రం ప్రయోగిస్తూ అన్నాడు సంపత్.

''నేను తెచ్చాను కదా'' పొట్లం విప్పి, ''కొంచెం దూరం జరగండి. గాలికి కళ్ళల్లో పడితే విపరీతమైన మంట. కళ్ళు పోయినా పోవచ్చు...'' అంటూ పొట్లం లోని పొడి ఆమె కళ్ళమీద పెట్టబోయాడు. కొద్దిగా మట్టి ఆమె మొహం మీద పడగానే అనూజ్ఞ చప్పున లేచి కూర్చుంది. చుట్టూ ఉన్నవాళ్ళు హాహాకారాలు చేశారు. ''ఆమెన్... ఆమెన్'' అంటున్నాడు ఫాదర్ వేషంలో ఉన్న కుర్రాడు. అంతా గోల గోల.

"ఆపరేషన్ సక్సెసయింది. రోగి మరణించాడు అన్నట్టు నాటకం బ్రహ్మాండంగా రక్తికట్టింది. ఫలితం మాత్రం జీరో అయింది'' అన్నాడు సంపత్.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments